# మానునయినా కాకపోతిని!

'పెద్దసార్ వాడు' నుంచి కబురొచ్చింది నన్నొకసారి రమ్మంటూ! నిన్న రాసిన అయిటంలలో ఏదైనా పొరబాటు జరిగిందా అని అడగబోయి ఊరుకొన్నాను. ఇంత చిన్నవిషయాలు పెద్దసార్‌వాడు వరకూ వెళ్లవు. అవి 'చిన్నసారువాడి' దగ్గరే సెటిలయిపోతాయి.

మెట్లెక్కి పెద్దసార్‌వాడి గది ముందు నిలబడ్డాను. గదికి ప్లైవుడ్ తలుపులు. తలుపుమీద 'ఎడిటర్' అన్న అక్షరాలు కూడగా ఉన్నాయి. ఆ గదిలోకి వెళ్లే అవసరం మాలాటి 'సబ్'లకు ఉండదు. టెలిప్రింటర్ మీద వచ్చే న్యూసంతా ఒకటి రెండు వాక్యాలు చదివి చిన్నసార్‌వాడు డెస్క్‌మీద ఉండే మాసబ్‌లకు పంచుతాడు. ఇది మీరు చేయండి, ఇది మీరు చూడండి అంటూ! 'చేయండి' అంటే తప్పక చెయ్యాల్సినవని గుర్తు. చూడండి అంటే అటూఇటుగా ఉంటే అవతల పారెయండి అని అర్థం. మాకుండే పనులన్నీ చిన్నసార్‌వాడితోనే. అనుమానాలన్నీ ఆ డెస్క్ దాటి బయటకురావు.

కానీ ఆ రోజున ఈ కబురు రావటం... చిత్రంగా ఉంది. భయంగా ఉంది. కొంత ఆశగానూ ఉంది. కొంపదీసి ఏ ప్రమోషనైనా... అనే చిన్న ఆశతో బతకటం కూడా నాకు వచ్చు.

గది బయట ఎక్కువసేపు నిలబడితే బాగుండదని తలుపును టాప్‌చేశాను. చీరకొంగు ఒకసారి సరిచేసుకొన్నాను. ఎడిటర్ గారిదగ్గరకు వెళ్లేటపుడు ఎలా ఆయనను విష్ చేయాలో మననం చేసుకొన్నాను.

తలుపుతోసి లోపలకు వెళ్లాను. హైడ్రాలిక్ డోర్ వెంటనే నా వెనుకనే మూసుకొంది.

"రామ్మా!" అన్నారు మూర్తిగారు ఆదరంగా.

ఆయన 'రామ్మా!' అని పిలవగానే ఎందుకో నా మనసొకసారి కలుక్కుమంది. ఇలాటి వ్యక్తినా మేం 'పెద్దసార్‌వాడు' అనుకొనేది! అలా అనుకోవటంలో ఆప్యాయత ఉంది కానీ కొంత అనౌచిత్యమూ ఉంది. నాకే తెలుస్తోంది.

మూర్తిగారు మా పత్రికకు సంపాదకులు. నిజానికి పత్రికా ఆయనదే. మేం అంతా అక్షరాలు రాయటం నేర్చుకొన్నాక, మిగిలిన వర్ణక్రమాన్ని, జీవితాన్ని ఆయనే నేర్పారు మాకు. ఈనాడు మా పత్రిక పదిమంది ఆదరణతో ఉందంటే కారణం ఆయన దానికి వెన్నెముకలా నిలవటం!

చెయ్యెత్తి నమస్కరించాను.

"రామ్మా-రా! కూర్చో!" అన్నారు మూర్తిగారు.

కూర్చున్నాను. కూర్చున్న రెండు నిమిషాలకే కాఫీలు వచ్చాయి. ఈలోగా ఆయనేమీ మాట్లాడలేదు. ఆయన ఏంచెప్తారో అన్న ఆందోళన నన్ను అక్కడ స్థిమితంగా కూర్చోనివ్వటంలేదు.

కాఫీ తాగాను, చాలవరకు అన్యమనస్కంగానే.

"చాలారోజులనుంచి నీ పనిని పరిశీలిస్తూనే ఉన్నాను. నాకు సంతృప్తికరంగా ఉంటోంది నీ పద్ధతి, పనితనం! దానికి తగ్గ ప్రతిఫలం ఇవ్వటం కూడా నేను ఆలోచిస్తూనే ఉన్నాను..!' ఆగారు ఒకసారి మూర్తిగారు.

అమ్మయ్య. గుండెల బరువు ఒక్కసారి దింపుకొన్నాను.

"కానీ... ఇంతకాలం నువ్వు సబ్‌గానే పనిచేశావు. కనీసం కొంతకాలం రిపోర్టర్‌గా పనిచేస్తే నీకు ఆ రంగంలోని కష్టనష్టాలు అవగాహన అవుతాయి. వాళ్ల రిపోర్ట్ చేస్తున్న పద్ధతులు ఎలా ఉంటున్నాయో నీకు తెలుసు. ఎలా ఉంటే బాగుండేదో కూడా నీకు తెలుసు. నువ్వే ఫీల్డ్‌మీద - సీన్ ఆఫ్ యాక్టివిటిలో ఉంటే - ఆ జాబ్ ఎలా చేస్తావో, దానికి ఉండే హద్దులేమిటో తెలుస్తాయి. అందుకే నిన్ను కొంతకాలం రిపోర్టర్‌గా చూసి, ఆ తర్వాత మరింత మేలైన ఉద్యోగానికి తీసుకోవాలని ఆలోచిస్తున్నాను!" అని ఆగారు మూర్తిగారు.

ఆయన ఏం ఆలోచిస్తూ ఉండి ఉంటారో నాకు తెలుసు.

ఆడదాన్ని - రిపోర్టింగ్‌కు పంపటంలో ఉన్న సాధకబాధకాలు ఇపుడాయన తూకం వేస్తూ ఉండొచ్చు. ఈ దేశంలో ఆడదానికి ఉన్న విలువ ఏమిటో అందరికీ తెలిసిందే. కానీ మా మూర్తిగారు కూడా అదే ఆలోచించటం....

కానీ నా ఊహ తప్పు.

ఆయన ఆలోచిస్తున్నది అదికాదు. ఆయనే ఆ సంగతి చెప్పారు : "నీ విషయం నేను ఆలోచించానమ్మా బాగానే! ఒంటరిదానవు. ఇలాటి రిపోర్టింగ్ రంగంలో స్త్రీలు ఇంకా అధికంగా లేని రోజులు ఇవి. పెళ్లి ఇంకా కాలేదు కనుక నిన్ను పంపటంలో కొన్ని కష్టాలు ఉన్నాయి. కానీ అవేవీ నువ్వు పట్టించుకోవనే నేను అనుకుంటున్నాను!" ఆయన ఆగారు.

జవాబు చెప్పాల్సింది నేను. ధైర్యం చేశాను. జీవితంలో నేను ఏమిటో అందరికీ చెప్పగలిగే అవకాశం వస్తోంది. వదులుకోవటం తెలివైన పనికాదు. అవకాశాలు వచ్చినపుడే అందిపుచ్చుకోవడం అవసరం. అందుకొంటున్నాను. "నాకా పట్టింపులు, భయాలు లేవండీ - ఉద్యోగం చేసే విషయంలో, విధినిర్వహణలో ఆడదైనా మగాడైనా ఒకటే! రిపోర్టింగ్‌లో నాకు ఇబ్బంది ఉంటుందనుకోను!! మీరు ఊ అంటే..."

ఆయన నవ్వారు. "నాకు తెలుసమ్మా నీ ధైర్యం! నీకెవరు పేరు పెట్టారో కానీ చాలా ఆలోచించి పెట్టారు. మీ తల్లిదండ్రులే ఈ పేరు అనుకొని ఉంటే వారెంతో దూరదృష్టి ఉన్నవారు! మంచి పేరమ్మా - ఝాన్సీలక్ష్మి!!"

నవ్వాను. నా పేరు ఎవరు సెలెక్ట్ చేసి పెట్టారో అన్న ఆలోచన నాకే ఇంతవరకూ కలగలేదు. తెలుసుకోవాలి. రిపోర్టింగ్ అక్కడనుంచి ఆరంభించాలి. 'ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం' అంటే ఇదేనా??

"సరే - ఇదిగో, ఇదీ రిపోర్టు. మొన్న వర్షాలకు లైన్లన్నీ దెబ్బతినేసాయి కదా, సరిగ్గా తెలీటంలేదు వ్యవహారం ఏమిటో! ఏదో గొడవ జరిగే ఉంటుదనిపిస్తోంది వచ్చినంతవరకు

రిపోర్టు చూస్తే. వెళ్లి చదువు ఒకసారి – ఆ ఊరెళ్లి – ఈవేళే నీ ప్రయాణం. అసలు విషయాలన్నీ ఒకటి రెండు రోజుల్లో తెలియజేయాలి నాకు! మంచి స్కూప్‌గా వేద్దాం దీన్ని! పైగా – ఆడ జర్నలిస్టు రిపోర్ట్ చేసిన విషయమైతే మరీ గొప్పగా ఉంటుంది!"

మూర్తిగారు అనేది వింటూనే ఫైలులో ఆయన పెట్టి ఇచ్చిన రిపోర్ట్ చూడబోయాను.

మూర్తిగారే అన్నారు మళ్లీ : "మరి నీ సంగతి! ఇది చాలా సున్నితమైన సంగతి, దురదృష్టకరమైన సంగతీనూ! ఇలాటివి ఆడవాళ్లయితేనే సరిగ్గా సరైన దృక్పథంతో చూసి అవగాహన చేసుకోగలరని నా నమ్మకం. అందుకే ఈ పని నీకు అప్పగిస్తున్నాను. జాగ్రత్తగా పనిచెయ్యమ్మా! నా నమ్మకం నిలబెట్టు!" అన్నారాయన.

అంటే 'ఇక వెళ్లు!' అని అర్థం. ఫైలు చేత్తో పట్టుకొని లేచి నిలబడ్డాను, సెలవు అన్నట్లు.

"నేనిపుడే మీ చిన్నసార్‌వాడికి ఫోన్‌చేసి చెప్తాను, నిన్ను ఇలా రిపోర్టింగ్‌కు పంపుతున్నట్లు! నువ్వు ఇలా తిన్నగా అక్కౌంట్స్‌కు వెళ్లి నీక్కావాల్సిన అడ్వాన్సు తీసుకొని ఫీల్డ్‌కు వెళ్లిపో! ఓ.కే.? – గుడ్‌లక్!" అన్నారు మూర్తిగారు.

గదినుంచి బయటకు వచ్చాను. ఎయిర్ కండిషన్డ్ గదిలోంచి బయటకొచ్చానని కాదు, జీవితం ఉన్నట్టుండి తీసుకొన్న మలుపును తెల్సుకొనేసరికి నా వళ్లంతా చెమటలు పట్టాయి.

పైగా 'మీ చిన్నసార్‌వాడికి' అన్నారు .అంటే – ఆయనకు తనను ఎలా పిలుస్తారో కూడా తెలిసే ఉంటుంది! బాబోయ్! కానీ అది ఆయన చాలా స్పోర్టివ్‌గా తీసుకున్నట్లుగా ఉంది.

డెస్క్‌కు వెళ్లక, ముందు తిన్నగా మా లేడీస్ స్పెషల్ రూంకు వెళ్లి ఆ ఫైలు విప్పాను. రిపోర్ట్ చదవనారంభించాను.

❖ ❖ ❖

బస్ దిగి తిన్నగా పోలీస్‌స్టేషన్‌కే వెళ్లాను. గంటన్నర బస్సు ప్రయాణం కాబట్టి, అంతక్రితం అయిదుగంటల రైలుప్రయాణం కాబట్టి బాగా బడలికగా ఉంది. నిద్ర కూరుకొస్తున్నట్లుగా ఉంది. అయినా ఈ ఉద్యోగం అలాటిది. కనురెప్పపాటు కాలం అయినా వృధా చేయకూడదు. ముఖ్యంగా ఇలాటి విషయాల్లో అయితే మరీనూ. ఆలస్యం జరిగితే. అది మరేదో పేపరువాళ్లు ప్రచురించేస్తేనో... ఏముందీ. చేయలేకపోయానన్న అసంతృప్తీ నాకు, నన్ను నమ్మి పంపిన పత్రికకు అపఖ్యాతీనూ...

వస్తున్న నిద్రను ఆపుకొంటూ, మనసులోని ఆందోళనను పైకి రానివ్వక జాగ్రత్తపడుతూనూ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాను.

స్టేషన్‌ముందు పెద్ద బాదంచెట్టు. చెట్టుమీద కొమ్మల్లో కొన్ని ఆకులు పండిపోయి ఉన్నాయి. కిందపడ్డ ఆకులు ఎండిపోయి ఉన్నాయి. అయినా కొన్ని ఆకులు ఇంకా పచ్చగా పైకి ముందుకు చూస్తున్నాయి.

నాకెందుకో ఆ చెట్టు అక్కడి జీవితాన్ని ప్రతిఫలిస్తోందనిపించింది. పండిపోయిన ఆకులు పోలీసుస్టేషన్‌లలో జరిగే దారుణాలకు ముఖం ఎర్రగా కోపాన్ని ప్రజ్వరిల్లచేస్తున్నట్లుగా ఉన్నాయనిపించింది. మరీ ప్రతిఘటన చూపినవారి బతుకులు వాడిపోయి ఎండిపోయినట్లు, కిందపడ్డ ఎండుటాకులు చెప్తున్నాయనిపించింది. అయినా సరే, మేం పచ్చగానే బతుకుతాం. భవిష్యత్తు మాదంటున్న యువతరానికి ప్రతీకల్లా చిగురుటాకులు పచ్చదనాన్ని ఆశగా నింపుకొన్నట్లు అనిపించింది.

మెట్లెక్కాను - నా ఊహలకు నేనే నవ్వుకొంటూ.

మెట్లు ఎక్కుతోంటే గుర్తొచ్చింది ఫైలులో చదివిన రిపోర్టు. ఈ మెట్లు ఎక్కడికి దారి తీస్తున్నాయి? అనుకొన్నాను. నన్ను నేను నిలవేసుకొని ప్రశ్నించుకొన్నాను.

"సబినస్పెక్టర్ ఉన్నారా?" అనడిగాను, అక్కడ ఉన్న పోలీసును.

పోలీసు లేచి నిలబడ్డాడు. ఒంటరి ఆడదాన్ని, వయసులో ఉన్నదాన్ని చూసి పోలీసు లేచి నిలబడ్డాడంటే అది కేవలం అటో ఇటో - ఏదో ఒకందుకే అయి ఉంటుందనిపించింది. అది గౌరవం అయితే... గాంధీగారు చచ్చి ఏ స్వర్గాన ఉన్నారో కానీ ఈ క్షణంలో ఆయనకు మొదటిసారి ఆత్మశాంతి లభించి ఉంటుంది. అది గౌరవం కాక ఆకలి అయితే... ఇది ఈ దేశంలో మామూలు సంగతి.

గాంధీ గారిలో ఎక్కడో కొంత నిజం ఉన్నట్లుంది. పోలీసు గౌరవాన్నే చూపాడు. "అయ్యగారు లేరమ్మా! ఇంటిదగ్గరే ఉన్నారు!!"

"ఇల్లెక్కడ?"

అడ్రసు చెప్పాడు ఆ పోలీసు. "అక్కడ దింపమంటారా?" అనీ అడిగాడు. తల తిరిగిపోయింది నాకు. నిజంగా పోలీసు బలగం అంతా ఇంత క్షణాలమీద మంచివారు అయిపోయారా, లేకపోతే ఇదంతా కలేనా??

"అక్కర్లేదు, నే వెడతా!" అంటూ బయలుదేరి ఆ అడ్రసు ప్రకారం నడక ఆరంభించాను.

ఓ పది అడుగులు వేసేసరికి నాలోని ఇన్వెస్టిగేటివ్ స్టింజ్ బయటపడింది - అన్నట్లు ఏ వివరాలు పోలీసును అడగనేలేదు, అనుకొంటూ వెనక్కు వచ్చాను. మళ్లీ పోలీసు మర్యాదతో...

"మీ ఇనస్పెక్టర్ డ్యూటీ ఎప్పుడు?"

"తెలీదమ్మా - నిన్నటినుంచి రావటంలేదు! ఇంటిదగ్గరే ఉంటున్నారు!"

అర్థమయింది. అంటే.. మళ్లీ బయలుదేరాను ఇంటికే!

ఇల్లు పట్టుకోవటం కష్టంకాలేదు. ముందుగా సబినస్పెక్టర్ని వివరాలు అడిగి ఆ తర్వాత నిజానిజాలు అన్వేషించటం చేయాలి.

తలుపు తట్టాను. ఇంట్లో ఏం జరుగుతోందో కానీ ఇంటిబయట - పోలీసు స్టేషన్‌ముందు ఉండే ప్రశాంతత లాగానే - నిశ్శబ్దంగా ఉంది.

నరసింహారావు వచ్చి తలుపు తీశాడు. నరసింహారావు అంటే - అవును, అతనే సబినస్పెక్టర్.

"నువ్వా?" అన్నాడు సింహం ఆశ్చర్యపోతూ.

"నేనే!" అన్నాను నేను. మీ ఊళ్లోఏదో గొడవ జరిగిందట కదా, దాని సంగతి కనుక్కోవాలని వచ్చాను!"

"నువ్వు డెస్కుమీద కూచుని ఉండేదానివి కదా! ఇలా...ఇదేమిటి?"

చెప్పాను - ఏం జరిగిందో, కేసు తీసుకోవటానికి ముఖ్యకారణం. సింహం ఇక్కడ ఉండటం అనీ చెప్పాను. "నిజానిజాలు చెప్పు. ఈ దెబ్బతో ప్రమోషన్ వచ్చి తీరాలి. అన్ని పేపర్లలోనూ నా పేరు నిలబడిపోవాలి!" అన్నాను.

సింహం నవ్వేశాడు. "అదదానివి, ఇంత కీర్తికాంక్ష ఉండకూడదు! పైగా ఇలాటి విషయం సాయంతో పేరు తెచ్చుకోవాలనుకోవటం...!"

నిజమే - క్షణం సిగ్గుపడ్డాను. అది ఒప్పుకొన్నాను.

లోపల కూర్చోబెట్టి కాఫీ ఇచ్చి తర్వాత చెప్పాడు సింహం - జరిగింది జరిగినట్లే చెప్తున్నానంటూ - సింహానికి ఆ రోజు డ్యూటీ ఉన్నా ఇంట్లోనే ఉండి ఆలస్యంగా పోలీసుస్టేషన్‌కు వెళ్లాడు. వెళ్లేసరికి... జరగకూడనిది జరుగుతోంది లోపల. ఒక్కడే పోలీస్ ఉన్నాడపుడు. టూ డబుల్ త్రీ. 'గుంటదాయి బాగుంటే...' అని వాడు కక్కుర్తిపడ్డాడు.

"ఎందుకొచ్చింది ఆ అమ్మాయి?" అనడిగాడు.

ఏదో గతిలేక. విధి గతి తప్పి. పెళ్లి చూపులకు వచ్చిదిట. తండ్రితోబాటుగా. తండ్రి ప్రాణాలు హఠాత్తుగా బస్సులోనే పోయాయి. తండ్రి శవాన్ని రూల్స్‌ప్రకారం బస్సువాళ్లు పోలీస్‌స్టేషన్ దగ్గర దింపేశారు కూడా. ఆ చిన్నదీ దిగింది. శవాన్ని లోపల పెట్టించి, ఆ అమ్మాయిచేత ఫిర్యాదు రాయించుకొనేందుకు కానిస్టేబుల్ లోపలకు తీసుకెళ్లాడు. రాత్రి కాబట్టి ఎవ్వరి దృష్టీ పడలేదు. వీలుగా ఉంది. పిల్ల బాగుంది. ఫిర్యాదు చేసే వీలులేదు. 'ఆ తర్వాత' ఎంత ఏడ్చినా అంతా తండ్రికోసం అనుకొంటారంతా - ఇంకేముందీ - ఫిర్యాదు పక్కనపెట్టి పిల్లను...

ఒళ్లు జలదరించింది నాకు. పక్కగదిలో శవాన్నిపెట్టి. ఇవతలగదిలో సరసాలు. సరసాలా అవి - ఒక ఆడదాన్ని చెరపట్టగలగటం... ఆ ఊహకే నాకు వాంతి వచ్చినంత పని అయింది.

"అటు శవం ఉండని, ఏదుండనీ వచ్చింది ఆడదేగదా!" అన్నాడు సింహం.

ఉలికిపడ్డాను - అంటే... సింహం ఆ చర్యను సమర్థిస్తున్నాడా? ఈ దేశంలో చదువు సంస్కారం ఇవేవీ ఎక్కడయినా ఉన్నాయా లేదా - స్త్రీని కేవలం ఆడదానిగా తప్ప ఇంకోరకంగా చూడలేని పరిస్థితి ఇది! ఎలాటి పరిస్థితిలోనైనా సరే స్త్రీలోని స్త్రీత్వాన్ని తప్ప ఇంకేమీ గుర్తించక లేకపోవటం... ఏమిటనాలి దీన్ని??

అడిగేశాను. మనసులో ఉన్న బాధనంతా కక్కి, సింహాన్ని కడిగేశాను.

"ఝూన్సీ.... నీ సంగతి నాకు కొత్తకాదు. నీ ఆవేశమే కానీ అసలు సంగతి వినవేం? నేను చెప్పేది ఆ కానిస్టేబుల్ మనస్తత్వం. అంతేగానీ మగాళ్ల మనస్తత్వం కాదు!"

సింహం అన్నదాంట్లో సబబు ఉంది. నిజం, అబద్ధం. న్యాయం, అన్యాయం - అన్నీ బేరీజు వేయాల్సిన ధర్మం నా ఉద్యోగానిది. ఆ ధర్మానికి కట్టుబడి, తర్వాత జరిగింది చెప్పమన్నాను.

సింహం వెళ్లేసరికి... ఏముందీ, అంతా జరిగిపోయింది. ఆ కానిస్టేబుల్ని లాగి రెండు కొట్టి, కొట్లో పడేశాడు. ఆ అమ్మాయి తండ్రి శవాన్ని పోస్ట్‌మార్టంకు పంపాడు. హఠాన్మరణానికి కారణం ఉందేమో పరిశీలించేందుకు. అన్నీ కోల్పోయిన ఆ అమ్మాయిని ఓదార్చేందుకు మార్గంలేక. పోలీస్‌స్టేషన్‌లోనే ఉంచితే జరిగే ఆందోళనను ఎదుర్కోలేక, ఇంటికి తీసుకొచ్చాడు.

“ఎవరా అమ్మాయి? ఇంకా ఇక్కడే ఉందా?” అనడిగాను.

మూర్తిగారు అన్న 'స్కూప్' దొరుకుతోంది. సింహం ఉన్నాడు కాబట్టి అన్ని వివరాలూ లభ్యం అవుతున్నాయి. అదృష్టం కలిసివస్తే వివరాలు అన్నీ ఇలా ఎదురొస్తాయి కాబోలు! బహుశా ఈ రిపోర్ట్‌చూసి మూర్తిగారు ఇంకేమీ అడగరు, ఫోటోలు, వివరాలు... అన్నీ సిద్ధం!! ఇంకా ఏంకావాలి సెన్సేషనల్ న్యూస్‌కు!! అదృష్టవంతురాల్ని. కానీ సింహం అన్నట్లుగా నా జీవితంలో అదృష్టానికి ఆమె దురదృష్టం కారణం కావటం.... బాధగానే ఉంది.

“ఆ - ఇక్కడే ఉంది. ఏమడిగినా జవాబు ఇవ్వదు. ఏ వివరాలూ చెప్పదు. నిన్నటినుంచీ, అదిగో, ఆ గదిలోనే ఉంది. ఆమె తండ్రి శవం వస్తే బహుశా ఆమె కొంత కోలుకోవచ్చు. నోరు విప్పి ఏమైనా చెప్తే కదా! ఎవరికైనా తెలియజేసేది?!” - సింహం అన్నదాంట్లో ఎంతో సబబు ఉంది. ఇలాటి పోలీసులూ ఉంటారా? పురుషుల్లో పుణ్య పురుషుడా సింహం?!

“పోనీ వివరాలు ఇంకోలా తెలుసుకొనే వీలే లేకపోయిందా?”

“ఆ అమ్మాయి చేతిలో ఉన్నవి రెండే - ఒకటి బ్రీఫ్‌కేస్, మరొకటి ఆమె హాండ్‌బాగ్. బ్రీఫ్‌కేస్‌లో ఏ వివరాలు దొరకలేదు. హాండ్‌బాగ్ గుర్తొచ్చేసరికి ఆమె దాన్ని తలకింద దిండుగా ఉపయోగిస్తూ కనిపించింది. ఎంత అడిగినా ఇవ్వలేదు. బాధపెట్టటం దేనికి ఊరుకొన్నాను!” అన్న సింహం క్షణం ఆగి అన్నాడు - “ఆడదానివి. విషయం తెలిసినదానివి. వెళ్లి వాళ్ల వాళ్ల వివరాలు కనుక్కో. తెలియజేద్దాం!

లేచాను. సింహం చూపించిన గదికేసి కదిలాను. దగ్గరగా వేసిన తలుపు తోసి చూశాను.

అక్కడ -

ఆ అమ్మాయి తల వంచుకొని కూచుంది. మోకాళ్లమధ్య ఉన్న ఆమె ముఖం సరిగా కనపడలేదు. దగ్గరగా వెళ్లాను. చనువుగా మీద చెయ్యివేశాను. ఆమె తలెత్తి నాకేసి చూసి, ఒక్కసారి బావురుమంది.

❖ ❖ ❖

మెట్లెక్కి పెద్దసార్‌వాడి గదిముందు నిలబడ్డాను. చేతిలో రెండు కవర్లు. గదికి పెద్ద ప్లైవుడ్ తలుపు. తలుపుమీద 'ఎడిటర్' అన్న అక్షరాలు హుందాగా ఉన్నాయి. చీరకొంగును ఒకసారి, గుండెను మరోసారి దిటవు చేసుకొని తలుపుమీద టాప్ చేసి తలుపు తోసి లోపలకు వెళ్లాను. హైడ్రాలిక్ డోర్ నా వెనుకనే మూసుకొంది.

"రామ్మా!" అన్నారు మూర్తిగారు సాదరంగా.

ఆయన అడిగే ప్రశ్నలకు జవాబుగా చేతిలోని కవర్ అందించాను. ఆ కవర్‌లో - కేసు వివరాలు, ఫోటోలు ఉన్నాయి. ఆయన ఆ రిపోర్ట్ చదివి, ఫోటోలు చూసి "ఫెంటాస్టిక్" అన్నారు.

"నాకు తెలుసమ్మా! నువ్వు ఈ పని చేయగలవని! ఈ దేశంలో ఆడపిల్లలు ఆటం బాంబులమ్మా! నా నమ్మకం నిలబెట్టావు!" అంటూనే ఆయన డ్రాలోంచి ఒక కవర్ తీశారు. దాన్ని నాకు అందించబోతూ అన్నారు - "ఇదిగో, ఇదీ నీకు రివార్డ్ - న్యూస్ వచ్చాక వచ్చే పేరు వేరుగా ఉండనే ఉంటుంది!"

ఆ కవరు అందుకోలేదు నేను.

"ఇదీ చూడండి!" అన్నాను ఇంకో కవరు అందిస్తూ.

"ఇదేమిటి?" అన్నారాయన ఆశ్చర్యంగా.

"చూడండి!" అన్నాను. అప్పటికే మూర్తిగారు ఆ కవర్లోని కాగితంలో విషయాన్ని అవగాహన చేసుకొన్నారు. ఆశ్చర్యపోతూ అడిగారు -"అంటే...?"

"అవునండీ - సింహం, ఆ భాగ్యాన్ని పెళ్లి చేసుకొంటున్నాడండీ!"

"సింహం అంటే ఇనస్పెక్టర్. భాగ్యం అంటే ఆ అభాగ్యురాలు - అవునా?"

"అవునండీ!"

"అంటే వెళ్లి పెళ్లికూడా కుదిర్చేశావన్నమాట! గొప్పతనం ఆ సింహంలో లేదమ్మా. నీలోనే ఉంది!"

"కాదండీ-" అని మూర్తిగారేదో అంటూంటే ఆపాను.

"కాదేమిటమ్మా - అది స్పష్టంగా తెలుస్తోంటేనూ. ఇది నీ విజయమే ఝాన్సీ. సరే కానీ, ఈ రాజీనామా ఏమిటి?" మూర్తిగారు నన్ను మొదటిసారి పేరు పెట్టి పిలిచారు.

"నా పేరు ఝాన్సీయేనండి. కాదనను. కానీ ఈ దేశంలో ఆడది - ఏ పేరుతో ఉన్నా ఆడదే. ఎంత అనాకారిగా ఉన్నా ఆడదే! కొందరు ఆడవాళ్లు బాధలు పడటానికి పుడతారు. కొందరు రాజీపడటానికి పుడతారు. ఈ దేశంలో ఆడాళ్ల చరిత్రలంతా ఇంతే!" అన్నాను నేను.

ఆయన నవ్వేశారు - "నీ రిపోర్ట్‌కు లీడ్ బాగుంది కానీ ఈ రాజీనామా ఎందుకు?"

"ఎందుకంటే... భాగ్యానికి ఇపుడు కాబోతున్న భర్త ........ నాకు భర్త అవుతాడనుకొన్న నా ప్రియుడు!... భాగ్యం అంటే భాగ్యలక్ష్మి - నా చెల్లెలు!!" ..... అక్కడనుంచి బయటకు నడిచాను.

హైడ్రాలిక్ డోర్ ఆ గదికి.

ముందు నా వెనుక తలుపు పడింది. ఆ తర్వాత నా జీవితానికి!!

- స్వాతి, వారపత్రిక